సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



సోమశిలలో 51.017 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 51.017 టీఎంసీలు ఉంగా, 11,200 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 600, ఉత్తరకాలువకు 5, దక్షిణకాలువకు 10 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.76,670
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,960
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,160
నవర (8 గ్రాములు)	రూ.57,280

గరిష్టం/కనిష్టం
36.0/27.0

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ 89 శాతం ఉంది.

న్యూస్‌రీల్

అటవీశాఖలో బదిలీలు

నెల్లూరు(అర్బన్): జిల్లా అటవీశాఖలో (టెరిటోరియల్)లో నెల్లూరు డివిజన్‌లో టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న జి.దుర్గాప్రసాద్‌ను గుంటూరు సర్కిల్ ఆఫీస్‌కు బదిలీ చేస్తూ ఆదివారం ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు. గుంటూరు డివిజన్‌లో పనిచేస్తున్న బి.కృష్ణానాయక్‌ని నెల్లూరు డివిజన్‌కు బదిలీ చేశారు. నెల్లూరు డివిజన్ టెరిటోరియల్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కె.పుష్పవతిని చిత్తూరు సోషల్ ఫారెస్ట్ డివిజన్‌కు బదిలీ చేశారు. ప్రకాశం జిల్లా మార్కాపురం డివిజన్‌లో డీడీ పీటీగా పనిచేస్తున్న ఎస్.వెంకటకృష్ణను నెల్లూరు డివిజన్‌కు బదిలీ అయ్యారు.

ఉదయగిరి రేంజర్..

ఉదయగిరి: ఉదయగిరి అటవీ రేంజ్ అధికారి పి.ఉమామహేశ్వరరెడ్డి ప్రకాశం జిల్లా కనిగిరి రేంజ్‌కు బదిలీ అయ్యారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు టైగర్ ప్రాజెక్ట్‌లో విధులు నిర్వహిస్తున్న బీఎస్ కుమారరాజా ఉదయగిరి రేంజ్‌కు బదిలీ అయ్యారు. ఉమామహేశ్వరరెడ్డి నాలుగేళ్లుగా ఉదయగిరి రేంజ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన హయాంలో జరిగిన పనులకు సంబంధించి పలు అవినీతి, ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయన బదిలీ కావడం విశేషం.

జెడ్పీ సీఈఓ బదిలీ



బదిలీ అయిన జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా పరిషత్ సీఈఓగా ఉన్న కన్నమనాయుడు కృష్ణా జిల్లా సీఈఓగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చిన కన్నమనాయుడు సమర్థవంతంగా విధులు నిర్వహించి పలువురి మన్ననలు పొందారు. ఆత్మకూరు ఏపీడీ ఖాదర్‌బాషాను జెడ్పీ సీఈఓగా నియమించారు. జిల్లా పరిషత్‌లో డిప్యూటీ డీఈఓగా ఉన్న భూపతి చిరంజీవిని ఒంగోలు జిల్లా పరిషత్ సీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏఐఎస్‌టీఈఏ నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న వెంకటరత్నం

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఆల్ ఇండియా షెడ్యూల్డ్ ట్రైబ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఎస్‌టీఈఏ) జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. నగరంలోని గిరిజన భవన్‌లో అసోసియేషన్ డైమండ్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరత్నం మాట్లాడుతూ అసోసియేషన్ ఏర్పడి 60 ఏళ్లు అయిందన్నారు. గిరిజనాభివృద్ధి విద్యాభివృద్ధి ద్వారానే జరుగుతుందన్నారు. గిరిజన విద్యార్థులు టెక్నికల్ కోర్సుల్లో చేరేందుకు గిరిజన ఉద్యోగులు కృషి చేయాలన్నారు. అనంతరం నిర్వహించిన జిల్లా కమిటీ ఎన్నికల్లో గౌరవాధ్యక్షుడిగా చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కిషోర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటరత్నం, కోశాధికారిగా గోవిందనాయక్, మహిళా కార్యదర్శులుగా సుకన్య, భవానీతో పాటు 50 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ యాకసిరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ పీడీగా నాగరాజకుమారి



డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెలూరు (దర్గామిట్ట): నెల్లూరు గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వీ నాగరాజకుమారిని నియమించారు. కృష్ణా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఫైనాన్స్ మేనేజర్‌గా ఉన్న ఆమెను డీఆర్‌డీఏ పీడీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెకు గతంలో జిల్లాలో పని చేసిన అనుభవం ఉంది.

జిల్లా పంచాయతీ అధికారిగా శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): పంచాయతీరాజ్‌శాఖలో పోస్టింగ్ కోసం వేచి ఉన్న శ్రీధర్‌రెడ్డిని నెల్లూరు జిల్లా పంచాయతీ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డీపీఓగా ఉన్న ఎం.సుస్మితారెడ్డిని శ్రీకాళహస్తి డీఎల్‌డీఓగా బదిలీ చేశారు.

హైకోర్టునే ధిక్కరిస్తూ..

అడ్డదారిలో అగ్రిమెంట్లు

జిల్లాలో ఇసుక డ్రెడ్జింగ్ నిలిపి వేయాలని కోర్టు ఉత్తర్వులు

- టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని ఆక్షేపణ
- నాలుగు వారాల పాటు అగ్రిమెంట్లు చేయొద్దని ఉత్తర్వులు
- పాత తేదీలతో డ్రెడ్జింగ్ పనులకు అగ్రిమెంట్ల తయారీ
- ఆదివారం సెలవు రోజు ఇరిగేషన్ ఆఫీసులో హడావుడి

జిల్లా ఇరిగేషన్ అధికార యంత్రాంగం బరితెగించింది. ఇసుక డ్రెడ్జింగ్‌కు అగ్రిమెంట్లు చేయొద్దన్న రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించి పాత తేదీలో రహస్యంగా అగ్రిమెంట్లు చేశారు. ఆదివారం సెలవు రోజు ఉద్యోగులు, సిబ్బంది ఎవరూ ఉండరని భావించిన అధికారులు తమకు అనుకూలంగా ఉండే ఒకరిద్దరు సిబ్బందితో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ తంతు కొనసాగించారు. ఉద్యోగులు తమ అధికారాలను అధికార పార్టీ నేతల కాళ్ల దగ్గర తాకట్టు పెట్టి వ్యవహరిస్తున్నారు.



రామలింగాపురంలోని కార్యాలయంలో ఆదివారం మంతనాలు చేస్తున్న ఇరిగేషన్ అధికారి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో ఇసుక దోపిడీకి పెన్నాతీరం వెంబడి ఉండే నియోజకవర్గాల నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు తొక్కని అడ్డదారులు లేవు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు తవ్వి తీసిన టీడీపీ ఎమ్మెల్యేలు ఇసుకను కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారానికి ముందే కాజేశారు. యార్డుల్లో మిగిలిన పిసరంతా ఇసుక నిల్వలను అడ్డం పెట్టుకుని నేరుగా రీచ్‌ల నుంచే కొంత తవ్వి తరలించారు. యార్డుల్లో పూర్తిగా ఖాళీ అయిపోవడం, ఇసుక తవ్వకాలకు అనుమతి లేకపోవడంతో రీచ్‌ల నుంచి తరలిస్తే ఎక్కడ దొరికిపోతామనే భయంతో 'పెన్నానదిలో పూడిక తీత' పేరుతో ఇసుక అక్రమ రవాణాకు పన్నాగం పన్నారు.

ఆ విధంగా డ్రెడ్జింగ్‌తో డీ సిల్టేషన్ చేసి ఇసుకను బోట్లతో తరలించే ప్రక్రియ ద్వారా దోపిడీ చేసేందుకు ఎమ్మెల్యేలు తెరచాటు రాజకీయం చేసి ఇరిగేషన్ అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. నెల్లూరు బ్యారేజీలోని నెల్లూరు, సంగం బ్యారేజీలోని సంగం, పొదలకూరు మండలంలోని సూరాయపాళెం ఈ ప్రక్రియ ద్వారా ఇసుకను తరలించి స్టాక్ పాయింట్ వద్దకు రవాణా చేసేలా పథకం రచించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, అడిషినల్ ఎస్పీతో పాటు డీటీసీతో పాటు ఇరిగేషన్, మైనింగ్ తదితర డిపార్ట్‌మెంట్లతో కలిపి ఎంప్యానల్ కమిటీ నియమించి తద్వారా ఆమోదించి గత నెల 23వ తేదీన పత్రిక ప్రకటన ద్వారా ఇసుక డీ సిల్టింగ్‌కు టెండర్లకు ఆహ్వానించారు. అర్హత ఉన్న బోట్స్ మాన్ సహకార సొసైటీ నుంచి టెండర్లకు ఆహ్వానించి అదే నెల 27వ తేదీన టెండర్లు ఓపెన్ చేశారు. మొత్తం 15 మంది టెండర్ల ప్రక్రియలో పాల్గొన్నారు.

అర్హత లేని వారికి డ్రెడ్జింగ్ అనుమతి

ఇసుక డ్రెడ్జింగ్ టెండర్లలో పాల్గొనేందుకు కోఆపరేటివ్ సొసైటీ ద్వారా అనుమతి ఉండాలి. బోటు వర్కర్స్ లేబర్ కాంట్రాక్ట్ కో –ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారికే అర్హత ఉంటుంది. జిల్లాలోని కోవూరు ఎమ్మెల్యే సమీప బంధువు, సర్వేపల్లి ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు కర్నూల్‌కు చెందిన చౌదరితో పాటు ఆత్మకూరు ఎమ్మెల్యే సమీప అనుచరుడు హడావుడిగా కో ఆపరేటివ్ సొసైటీలో అనుమతి లేకుండానే రిజిస్ట్రేషన్ శాఖలోని లేబర్ వెల్ఫేర్ పేరుతో సొసైటీ రిజిస్ట్రేషన్ చేయించి టెండర్లలో పాల్గొన్నారు. వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీలకు వ్యాపారం చేసే అర్హత ఉండదు. కానీ టెండర్లలో వారి దరఖాస్తులు జిల్లా ఎంప్యానల్ కమిటీ ఓకే చేసింది. టెండర్లలో పాల్గొన్న 15 మంది కలిసి పని చేయాలని కలెక్టర్ అనుమతిచ్చారు.

పోలీసులతో కొట్టించి..

పెన్నానదిలో డ్రెడ్జింగ్ పనులకు ఎమ్మెల్యేలు సూచించిన వారే బోట్లు తెచ్చి పెట్టారు. ఆ ముగ్గురుకు సంబంధించిన వారే డ్రెడ్జింగ్ పనులు చేస్తున్నారు. మిగిలిన వారు బోట్లు తెస్తే స్థానిక పోలీసులతో బెదిరించి వారి లారీలకు పని కల్పించి వెనక్కు పంపుతున్నారు. ప్రస్తుతం ఆ ముగ్గురుకు సంబంధించిన వారే ఇసుక డ్రెడ్జింగ్ చేసి అక్రమంగా రవాణా చేయిస్తున్నారు. బిల్లులు పేరుతో కొంత ఇసుక మాత్రమే లోడింగ్ చేస్తూ అనధికారికంగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

అగ్రిమెంట్లు ఇచ్చేశాం

కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి అగ్రిమెంట్లు చేయడంపై 'సాక్షి' ఇరిగేషన్ ఈఈ నాగరాజును వివరణ అడగ్గా, ఇసుక డ్రెడ్జింగ్ చేసి డీ సిల్టింగ్ ద్వారా ఇసుక రవాణాకు సంబంధించి టెండర్లలో పాల్గొన్న వారందరికి అగ్రిమెంట్లు ఇచ్చేశాం. అందరికీ ఇవ్వలేదని బోట్స్ మెన్ చెబుతున్నారని ప్రశ్నించగా నేను మరొక చోట ఉన్నానని ఈఈ మాట దాటవేశారు. కోర్టు ఉత్తర్వులు ఉంటే ఎలా ఇస్తారని ప్రశ్నిస్తే.. అంతకు ముందే ఇచ్చామంటూ ఫోన్ కట్ చేశారు.

హైకోర్టు ఉత్తర్వులను పక్కన పెట్టి..

ఇసుక డ్రెడ్జింగ్ పనుల టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని లేబర్ వెల్ఫేర్ సొసైటీలకు వ్యాపారం చేసే అర్హత లేని వారికే టెండర్లు ఓకే చేశారని పలువురు హైకోర్టును ఆశ్రయించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపిన హైకోర్టు టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని నిర్ధారించింది. కలెక్టర్ ఇచ్చిన ప్రొసిడింగ్స్‌లో 2, 3, 4గా టెండర్లు వేసి ఉన్న వెల్ఫేర్ సొసైటీలను తొలగించాలని, వారికి అగ్రిమెంట్లు చేయొద్దని ఈ నెల 20వ తేదీ ఉత్తర్వులిచ్చింది. అయితే రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను సైతం ఉల్లంఘించి న్యాయస్థానాన్నే తప్పుదోవ పట్టించేలా పాత తేదీలతో అడ్డదారుల్లో అగ్రిమెంట్లు చేశారు. పెన్నానదిలో ఇసుక డ్రెడ్జింగ్ ద్వారా డీసిల్టేషన్ ప్రక్రియకు అడ్డంకులు లేకుండా హైకోర్టును ఉత్తర్వులనే అపహాస్యం చేశారు.



ఇరిగేషన్ కార్యాలయంలో సగం తలుపు తెరిచి వ్యవహారాలు నెరుపుతున్న దృశ్యం

తేదీలు మార్చి అగ్రిమెంట్లు

హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ స్థానిక ఇరిగేషన్ ఈ ఈ కార్యాలయంలో ఆదివారం అధికారులు హడావుడిగా ఈ నెల 18వ తేదీనే అగ్రిమెంట్లు ఇచ్చినట్లుగా పాత తేదీలు వేసి ఇచ్చేశారు. మొత్తం 15 మందికి గాను పెన్నానదిలో యంత్రిక ఇసుక పడవుల యజమానుల సంఘం సొసైటీ, మముదురు పెన్నా యాంత్రిక ఇసుక పడవుల యజమానులు సొసైటీ, తరదేవి బోట్స్‌మెన్ అండ్ లేబర్ వెల్ఫేర్ సొసైటీలకు సంబంధించిన వారికే అగ్రిమెంట్లు ఇచ్చేశారు. మిగిలిన 12 మందికి అగ్రిమెంట్లు ఇవ్వలేదని ఆ బోట్స్‌మెన్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోర్టు ధిక్కారంపై..

జిల్లా ఇరిగేషన్ అధికారులు హైకోర్టు ఉత్తర్వులు ధిక్కరించిన వైనంపై సాక్ష్యాధారాలతో న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. అర్హత లేని వారికి డ్రెడ్జింగ్ పనులు కట్టబెట్టడమే కాకుండా కోర్టు ఉత్తర్వులను సైతం ఉల్లంఘిస్తున్నారని ఆధారాలు సేకరించి కోర్టులో సమర్పిస్తే.. ఒక వేళ హైకోర్టు ఆగ్రహిస్తే జిల్లా ఎంప్యానల్ కమిటీ న్యాయస్థానం బోనులో దోషులుగా నిలబడాల్సి ఉంటుంది.

లోకేశ్‌ను కలిస్తే అడ్డంగా నరికేస్తావా?

- కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి మాలేపాటి సూటి ప్రశ్న



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర తదితరులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ పుట్టినప్పటి నుంచి పార్టీలో ఉన్న మేము మా సమస్యలపై మంత్రి లోకేశ్‌ను కలిస్తే మమ్మల్ని అడ్డంగా నరికేస్తావా? అంటూ కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర తదితరులు సూటిగా ప్రశ్నించారు. కావలిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ అధికారంలో లేనప్పుడు కావలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా తాను పార్టీ శ్రేణులతో కలిసి ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తే నాపైనే కావ్య 16 కేసులు పెట్టించాడని సుబ్బానాయుడు అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా తనపై కేసు నమోదు చేశారని చెప్పారు. ప్రాణాలు పోయే పరిస్థితి నుంచి కోలుకున్నానని తెలిపారు. కావలి– తుమ్మలపెంట రోడ్డు, బుచ్చిరెడ్డిపాళెం–దగదర్తి రోడ్డుకు గత టీడీపీ ప్రభుత్వం హయాంలోనే బీద రవిచంద్ర నిధులు మంజూరు చేయించారన్నారు. తాను కావలిలోనే ఉంటానని, టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని స్పష్టం చేశారు. మన్నవ రవిచంద్ర మాట్లాడుతూ తాము ఒక అమ్మ, అబ్బకే పుట్టామని, అందుకే టీడీపీ ఆవిర్భావం నుంచి కూడా టీడీపీలోనే ఉన్నామని తెలిపారు. పార్టీకి తామెవరూ ద్రోహం చేయలేదన్నారు. పార్టీ పెద్దలు, ముఖ్యలను కలిస్తే అడ్డంగా నరికేస్తానంటే ఇక్కడ ఎవరూ చూస్తూ ఊరుకోరని స్పష్టం చేశారు.

ధర్మాన్ని ఆచరించిన మహాపురుషుడు శ్రీరాముడు

నెల్లూరు (బృందావనం): ధర్మాన్ని అతిక్రమించక ఆచరించి చూపిన మహాపురుషుడు శ్రీరాముడని ప్రముఖ ఉపన్యాసకులు అగస్త్యరాజు సుబ్బారావు తెలిపారు. పద్య కళా పరిషత్ ఆధ్వర్యంలో పురమందిరంలోని వర్ధమాన సమాజం హాల్లో ఆదివారం రాత్రి బ్రహ్మవిద్యాచార్య బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. హనుమజ్జానకీరామశర్మ రచించిన 'శ్రీరామాయణం'పై ఆయన ఉపన్యసించారు. ఉపన్యాసకులు సుబ్బారావును పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు ఘనంగా సన్మానించారు. కవులు కె.మురళీకృష్ణ, ప్రసాద్, గిరిజాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని వేదం రాధాకృష్ణమూర్తి పర్యవేక్షించారు.

స్వార్థపరులే పార్టీని వీడారు



మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్

- వైఎస్సార్‌సీపీకి ఎలాంటి నష్టం లేదు
- కొత్త నేతలకు అవకాశాలు ఉంటాయి
- మాజీ మంత్రి అనిల్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి
- నెల్లూరు నగర నియోజకవర్గ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం

నెల్లూరు (బారకాసు)/ నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): : అధికారంలో ఉన్నంత కాలం అనుభవించి, ఈ రోజు స్వార్థ ప్రయోజనాలు ఆశించి వైఎస్సార్‌సీపీని వీడారని, వారి వల్ల పార్టీకి ఎలాంటి నష్టం లేదని మాజీ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. నగరంలోని విజయమహల్ గేట్ సమీపంలోని ఎంసీఎస్ కల్యాణ మండపంలో ఆదివారం నెల్లూరు నగర నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. తొలుత దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ తాను మంత్రిగా ఉన్న సమయంలో ఏ నాడు రాజకీయ కక్షలకు పోలేదన్నారు. నేడు అధికార పార్టీ నేతలు తమ కార్యకర్తలను ఇబ్బంది పెట్టడం ఎంత వరకు సమంజసం అని నిలదీశారు. అదే వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు తాము అనుకుని ఉంటే నారాయణ విద్యాసంస్థలు ఉండేవా? అని ప్రశ్నించారు. ఎవరు వెళ్లినా పార్టీకి ఎలాంటి నష్టం లేదని, పార్టీలో కొత్త వారికి అవకాశం కల్పిస్తామన్నారు. దసరా నుంచి నెల్లూరులోనే అందుబాటులో ఉంటానని, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటూ వారిని రక్షించుకుంటూ ఉంటామని స్పష్టం చేశారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారని ఆయన ఆదేశాల మేరకు ప్రతి పార్టీ కార్యకర్త పని చేయాలని తెలియజేశారు. ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తాను నెల్లూరు సిటీ నియోజకవర్గ బాధ్యతలు తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడుస్తున్నా.. ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. అధికార పార్టీకి ఏడాది టైం ఇస్తున్నానని.. ఈ ఏడాదిలోపు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని చెప్పారు. అనంతరం మాజీమంత్రి డాక్టర్ అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్‌ను పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గజమాలతో ఘనంగా సత్కరించారు.

పెట్‌.. ట్రీట్‌మెంట్ భేష్

- ఎక్కువ ఓపీలు చూసే వెటర్నరీ ఆస్పత్రిగా గుర్తింపు
- అత్యాధునిక వైద్యపరికరాలు
- రోజుకు 150 ఓపీలతో చికిత్స అందిస్తున్న వైద్యులు
- నిత్యం రెండు.. మూడు సర్జరీలు



నెల్లూరు (సెంట్రల్): వైద్యంలో మనుషులకు ఎంత ప్రాధాన్యత ఉందో... మూగ జీవాలకు కూడా అంతే ప్రాధాన్యత కల్పించి మెరుగైన వైద్యాన్ని అందించిన ఘనత గత ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పుకోవచ్చు. ప్రధానంగా ప్రత్యేక వాహనాలను సైతం ఏర్పాటు చేసిన మూగ జీవాలకు చికిత్స అందించింది. చాలా కుటుంబాలు ఎంతో ప్రీతిగా పెంచుకునే పెంపుడు కుక్కలకు సైతం ప్రభుత్వం తరపున మెరుగైన వైద్యం అందుతుందంటే గత ప్రభుత్వం చొరవ వల్లే అని చెప్పక తప్పదు.

నిత్యం మూడు వరకు సర్జరీలు

వెటర్నరీ వైద్యశాలలో కుక్కలకు సంబంధించి నిత్యం రెండు నుంచి మూడు సర్జరీలు జరుగుతుంటాయి. రాష్ట్రంలో ఏ వైద్యశాలలోనూ ఈ విధంగా నిత్యం సర్జరీలు, ఓపీలు చూసిన దాఖలాలు లేవనే చెప్పాలి. ప్రత్యేక అత్యాధునిక పరికరాలతో మొత్తం పరీక్షలు నిర్వహించి సర్జరీకి ఒక తేదీని నిర్ణయిస్తారు. ఆ తేదీన సర్జరీలు చేసి, ఎప్పటికప్పుడు వాటి ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తుంటారు. ఇటీవల 33 వేల రేబీస్ నివారణ టీకాలు కూడా వేశారు. ఈ విధంగా ప్రతి రోజు టీకాలు, ఉచితంగా మందులు అందిస్తుంటారు. ప్రభుత్వ వెటర్నరీ వైద్యశాలకు అనేక జాతుల కుక్కలను వైద్యం కోసం తీసుకుని వస్తుంటారు. కుక్కలకు ప్రత్యేక వైద్యం అందిస్తుండడంతో రాష్ట్రంలో ఎక్కువగా ఓపీలు, సర్జరీలు చేసే వైద్యశాలగా గుర్తింపు తెచ్చుకుని అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రిగా ఉన్న అప్పలరాజు చేతుల మీదుగా జిల్లా వెటర్నరీ అధికారులు అవార్డు అందుకోవడం గమనార్హం.

నిత్యం 150 ఓపీలు

నెల్లూరులోని రైల్వేఫీడర్స్ రోడ్డులో ఉన్న జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న కుక్కల ఆస్పత్రి కిటకిటలాడుతోంది. నెల్లూరుతో పాటు, చుట్టు పక్కల ప్రాంతాల నుంచి కూడా పెంపుడు కుక్కలను తీసుకుని వచ్చి వైద్యం చేయించుకుంటుంటారు. దాదాపుగా రోజుకు 130 నుంచి 150 వరకు కుక్కలకు ఓపీలు అందిస్తూ వైద్యాన్ని అందిస్తుండడం గమనార్హం. ప్రధానంగా కుక్కల వైద్యానికి కావాల్సిన అన్ని సకల సౌకర్యాలు కలిగి ఉండడం విశేషం. స్కానింగ్, అల్ట్రా సౌండ్‌తో పాటు అన్ని రకాల సౌకర్యాలు వైద్యశాలలో కలిగి ఉన్నాయి.

నిత్యం అందుబాటులో వైద్యులు



వెటర్నరీ వైద్యశాలలో ఉదయం నుంచి సంబంధిత వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారు. చికిత్స కోసం అనేక జాతుల కుక్కలను ఇక్కడికి తీసుకుని వస్తుంటారు. వాటికి కావాల్సిన వైద్యాన్ని బట్టి వైద్యం అందించడంతో పాటు, సర్జరీ అవసమైతే వాటికి తేదీ కూడా కేటాయిస్తారు.

– రమేష్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

జీతాలివ్వండి మహాప్రభో

- డీసీఎమ్మెస్ సిబ్బంది వినతి



నెల్లూరు (వీఆర్సీసెంటర్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలలుగా జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ (డీసీఎమ్మెస్) సిబ్బంది జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో డీసీఎమ్మెస్ ప్రధాన కార్యాలయం ఉంది. 18 మంది వరకు శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో డీసీఎమ్మెస్ చైర్మన్‌గా ఉన్న వీరి చలపతిరావు తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించింది. అయితే సదరు అధికారి వీరి జీతాల విషయాన్ని పట్టించుకోలేదు. తమకు జీతాలు కావాలని జిల్లా స్థాయి అధికారిని అడిగేందుకు ధైర్యం చాలని సిబ్బంది మూడు నెలలుగా వేతనాలు రాకున్నా చేసేదేమీ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ పరిస్థితిని గుర్తించి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరణకు డిమాండ్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టులో మూసివేసిన కంటైనర్ టెర్మినల్‌ను వెంటనే పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్‌కుమార్, అధ్యక్షుడు టీవీ ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. ముత్తుకూరులో ఆదివారం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో వారు ప్రసంగించారు. అధికారంలో ఉన్న టీడీపీ పాలకులు బీజేపీ మెడలు వంచి, కంటైనర్ టెర్మినల్ కొనసాగించేందుకు అదానీని ఒప్పించాలన్నారు. కృష్ణపట్నం పోర్టును కేవలం బొగ్గు దిగుమతికి ఉపయోగిస్తూ డర్టీ పోర్టుగా మార్చేస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. టెర్మినల్‌ను పునరుద్ధరించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. దీనికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కృష్ణపట్నం పారిశ్రామిక క్లస్టర్ అధ్యక్షుడు గడ్డం అంకయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, నక్కా రాధయ్య, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామారావు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి కొండచిలువ

సంగం: మండల కేంద్రమైన సంగంలోని సాయినగర్ నుంచి పాతూరుకు వెళ్లే దారిలో వంతెన సమీపంలో శనివారం అర్ధరాత్రి కొండచిలువ కలకలం రేపింది. జనావాసాల్లోకి రావడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. గతంలోనూ సంగం ఇసుక డంపింగ్ యార్డు వద్ద కూడా కొండచిలువ కనిపించింది. అటవీ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చిరువ్యాపారిపై కత్తితో దాడి

బిట్రగుంట: మండలంలోని బోగోలులో ఆవుల రాజేష్ అలియాస్ చిన్నా అనే వ్యక్తి ఆదివారం రాత్రి కత్తితో వీరంగం సృష్టించాడు. మద్యం మత్తులో చిరువ్యాపారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. బోగోలు పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన ఆవుల రాజేష్ మద్యం మత్తులో స్థానిక యూనియన్ బ్యాంక్ సమీపంలోని లక్ష్మయ్య టీకొట్టు వద్ద గొడవకు దిగాడు. చిరువ్యాపారి లక్ష్మయ్య, అతని కుమారులతో వివాదం తలెత్తడంతో రాజేష్ ఇంటికి వెళ్లి కత్తి తెచ్చాడు. దుకాణంలోని లక్ష్మయ్యపై దాడి చేసి గాయపరిచాడు. స్థానికులు స్పందించి ఆయన్ను వెంటనే 108 అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థినికి అస్వస్థత

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని బాలయోగి గురుకుల పాఠశాల విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. గురుకులంలో తొమ్మిదో తరగతి చదువుతున్న సుభిత అనే విద్యార్థిని సాయంత్రం తనను ఏదో కుట్టిందని హాస్టల్ సిబ్బంది తెలియజేసింది. వారు పురుగు కుట్టి ఉంటుందని భావించి సర్ది చెప్పారు. అంతలోనే విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తుండడంతో సిబ్బంది వెంటనే కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కోవూరుపల్లి పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో కావలి ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. ప్రస్తుతం విద్యార్థిని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

మంటలు చెలరేగి..



మంటల్లో కాలిపోతున్న స్తంభం

ఆత్మకూరు: పట్టణంలోని సత్రం సెంటర్ ఆర్యవైశ్య బజారులో ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణం విద్యుత్ స్తంభం వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.. సాయంత్రం నుంచి వర్షం కురిసింది. కాసేపటి అనంతరం స్తంభం వద్ద ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మంటలు వ్యాపించి వైర్లు కాలిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అధికంగా వాహనాలు, ప్రజలు తిరుగుతున్న ప్రాంతంలో ఇలా జరగడంతో తీవ్ర ఆందోళన చెందారు. స్థానికులు, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు.

ఉపాధ్యాయులతో ఆటలు

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను జిల్లా విద్యాశాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. అనుకూలంగా ఉన్న వారినే సమీపంలోని పాఠశాలల్లో మండల విద్యాశాఖ అధికారులు సర్దుబాటు చేశారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎస్జీటీలకు పదోన్నతుల విషయాన్ని పట్టించుకోకుండా హైస్కూల్స్‌కు పంపి చేతులు దులుపుకొన్నారు.

- ఇష్టారాజ్యంగా సర్దుబాటు ప్రక్రియ
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు
- ఎస్జీటీలకు పదోన్నతులు ఇవ్వకుండానే హైస్కూల్స్‌కు సర్దుబాటు
- మండల, డివిజన్ స్థాయిలో ప్రక్రియ పూర్తి
- ఇంకా జిల్లాస్థాయిలో చేపట్టని అధికారులు
- విధుల్లో చేరేది లేదంటున్న 100 మందికి పైగా టీచర్లు



నెల్లూరు దర్గామిట్టలోని జిల్లా పరిషత్ హైస్కూల్

జిల్లాలో..	
గుర్తించిన స్కూళ్లు	467
సర్‌ప్లస్‌గా గుర్తించిన టీచర్ల సంఖ్య	782
సర్దుబాటు చేపట్టిన స్కూళ్లు	353
టీచర్ల సంఖ్య	545

నెల్లూరు(టౌన్): ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను జిల్లా విద్యాశాఖాధికారులు సాగదీస్తున్నారనే ఆరోపణలున్నాయి. మండల, డివిజన్ స్థాయిలో అతికష్టం మీద పూర్తి చేశారు. జిల్లా స్థాయిలో చేసేందుకు ఎంత సమయం తీసుకుంటారని యూనియన్లు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఎఫ్ఏ-1 పరీక్షలు ముగిశాయి. త్వరలో ఎస్ఏ-1 పరీక్షలకు షెడ్యూల్‌ను విడుదల చేయనున్నారు. జిల్లాలో మొత్తం 467 పాఠశాలల్లో 782 మంది సర్‌ప్లస్‌గా ఉన్నట్లు గుర్తించారు. 353 స్కూళ్లకు సంబంధించి మాత్రమే 545 మందిని ఆయా పాఠశాలలకు సర్దుబాటు చేశారు. వీరంతా రిలీవ్ అయ్యి వెంటనే కొత్త బడుల్లో చేరాలని జిల్లా విద్యాశాఖాధికారులు గత వారంలో ఆర్డర్లు ఇచ్చారు. అయితే కొందరు విధుల్లో చేరేందుకు విముఖత చూపుతున్నారు.

ఎలా పడితే అలా..

తొలుత మండల, డివిజన్ స్థాయిలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపట్టారు. మండల స్థాయిలో ఎంఈఓల ఆధ్వర్యంలో జరిగింది. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు – 3, జీవశాస్త్రం – 49, ఇంగ్లిష్ – 15, తెలుగు – 44, హిందీ – 162, గణితం – 27, భౌతిక శాస్త్రం – 65, సోషల్ – 60 మంది, ఎస్జీటీలు – 357 మందిని సరప్లస్‌గా గుర్తించారు. జీవశాస్త్రం – 45, ఇంగిష్ – 52, తెలుగు – 29, హిందీ – 46, గణితం – 71, భౌతికశాస్త్రం – 64, సోషల్ – 79, ఎస్జీటీలు – 159 మందిని అడ్జెస్ట్‌మెంట్ చేశారు. ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించకుండానే హైస్కూళ్లకు సర్దుబాటు చేశారు. 237 మందిని మిగులుగా తేల్చారు. వీరిలో కొద్దిమందిని జిల్లాస్థాయిలో సర్దుబాటు చేసి పాఠశాలలకు పంపించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. కాగా ఆయా మండలాల్లో ఎంఈఓలకు అనుకూలంగా ఉన్న కొంతమంది ఉపాధ్యాయులకు వారికి అనుకూలమైన చోట అవకాశం కల్పించారని పలు టీచర్ల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆయా మండలాల్లోనే 8 కిలోమీటర్ల పరిధిలోనే చేయాలని గతంలో జీఓ విడుదల చేసినట్లు చెబుతున్నారు.

వెళ్లేది లేదు

జిల్లా విద్యాశాఖాధికారులు చేసిన సర్దుబాటు ప్రక్రియపై కొంతమంది ఉపాధ్యాయులు విముఖత చూపుతున్నట్లు తెలిసింది. గత వారంలో వీరికి ఇవ్వగా 100 మందికి పైగా సర్దుబాటు చేసిన ప్రాంతాల్లో విధుల్లో చేరేందుకు ఇష్టపడడం లేదు. ఇప్పటి వరకు ఆయా పాఠశాలల్లో జాయిన్ కాలేదని తెలిసింది. ఎంఈఓలు ఇష్టారాజ్యంగా చేయడం వల్లే ఈ ప్రక్రియలో అన్యాయం జరిగిందని వారు చెబుతున్న మాట. అయితే విద్యాశాఖాధికారులు మాత్రం వారు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారుల మాటను పరిగణలోకి తీసుకుంటారా లేదా ఉన్న పాఠశాలలోనే బోధన చేస్తారా? అని తెలియాల్సి ఉంది.

కొన్ని ఉదాహరణలు

- ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఓ పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీని సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉండే అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడు హైస్కూల్‌కు పంపారు. అక్కడ ఒక గణితం (స్కూల్ అసిస్టెంట్) టీచర్ కూడా లేరు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు గణితం సబ్జెక్టును ఇప్పుడు సదరు టీచరే బోధించాలి.
- కలువాయి మండలంలో పనిచేస్తున్న ఓ స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్)ను 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లిలోని హైస్కూల్‌కు పంపారు. ఈ విషయంపై ప్రశ్నిస్తే డివిజన్ సర్దుబాటులో అంత దూరం వెళ్లాల్సి వచ్చిందంటున్నారు.
- నెల్లూరు కార్పొరేషన్‌ను ఒక యూనిట్‌గా తీసుకుని సర్దుబాటు చేయాల్సి ఉంది. గతంలో కూడా ఇదే విధంగా చేశారు. అయితే ఈసారి నగరాన్ని రెండు మండలాలుగా విభజించి ప్రక్రియ చేపట్టడంతో కొంతమంది ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని యూనియన్ నాయకులు చెబుతున్నారు.

కొందరు టీచర్లకు అన్యాయం జరిగింది



ఎన్నికల ముందు 117 జీఓను రద్దు చేసి మెగా డీఎస్సీ నిర్వహిస్తామని నారా లోకేశ్ చెప్పారు. అయితే ఆయన చేతల్లో చూపలేదు. ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించకుండా హైస్కూల్స్‌కు సర్దుబాటు చేయడం అన్యాయం. ఇప్పటికే ప్రాథమిక విద్యను మరింత ప్రమాదంలోకి నెట్టారు. 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే ఉంచి విద్యను బలోపేతం చేయాలి. సర్దుబాటు ప్రక్రియలో కొంతమంది టీచర్లకు అన్యాయం జరిగింది.

– అల్లంపాటి సురేంద్రరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఏపీటీఎఫ్

ఉపాధ్యాయులందరూ చేరాల్సిందే..

సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులందరూ ఆయా పాఠశాలల్లో చేరాల్సిందే. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదు. విధుల్లో చేరకుంటే రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– పీవీజే రామారావు, డీఈఓ

షుగర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రాధికారెడ్డి
- ఘనంగా ఏపీ డయాబెటిక్ ఫెడరేషన్ 33వ కాన్ఫరెన్స్



జ్యోతి ప్రజ్వలన చేసి కాన్ఫరెన్స్‌ను ప్రారంభించిన అతిథులు, డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): 'షుగర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండండి. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అదుపులో ఉంచుకోవచ్చు' అని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. ఏపీ డయాబెటిక్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి 33వ కాన్ఫరెన్స్ నెల్లూరు దర్గామిట్టలోని మినర్వా గ్రాండ్ హోటల్లో ఘనంగా ఆదివారం జరిగింది. నగరానికి చెందిన డయాబెటిస్ డాక్టర్ పావులూరి మాధవ్ అధ్యక్షతన జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. రాధికారెడ్డి మాట్లాడుతూ షుగర్ వ్యాధికి తక్కువ ఖర్చుతో వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. వ్యాయామం, ఆహారపు అలవాట్లు మార్చుకోవడం ద్వారా పూర్తిస్థాయిలో కంట్రోల్లో ఉంచుకోవచ్చన్నారు. డాక్టర్లు రోగులకు అవగాహన కల్పించి వారికి అండగా ఉండాలన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రముఖ డాక్టర్లు పీవీరావు, సంజయ్‌రెడ్డి , వసంత్ కుమార్, చెన్నై నుంచి వచ్చిన విజయ విశ్వనాథన్, ఎస్ఎస్ నరశింగన్‌లు షుగర్ వ్యాధికి సంబంధించి వచ్చిన అధునాతన చికిత్స విధానాలును వివరించారు. మాధవ్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల వల్ల ఆధునిక వైద్య విజ్ఞానం అందరికీ అందుబాటులోకి వస్తుందన్నారు. అనంతరం రిజిస్ట్రార్ రాధికారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో బెంగళూరు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ డాక్టర్లతోపాటు ఐఎంఏ పూర్వ రాష్ట్రాధ్యక్షుడు డాక్టర్ అశోక్, జిల్లా అధ్యక్షుడు ఎంసీఎస్ రెడ్డి, డా.అనిల్‌కుమార్‌రెడ్డి, డా.సహజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఆటో



చికిత్స పొందుతున్న సుబ్బమ్మ



తీవ్రంగా గాయపడిన వారు

- పలువురికి గాయాలు

దుత్తలూరు: ఆర్టీసీ బస్సును ఆటో ఢీకొన్న ఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం మండల కేంద్రమైన దుత్తలూరులోని సచివాలయం వద్ద ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మందాలనాయుడుపల్లి నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆటో దుత్తలూరు సచివాలయం వద్దకు రాగానే అదుపుతప్పి పామూరు నుంచి నెల్లూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నాగవేణి, సుబ్బమ్మ, పెంచలమ్మ, హరిణితో పాటు మరికొందరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ సమాచారం అందించడంతో దాని సిబ్బంది వచ్చి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పెంచలమ్మ, హరిణి తీవ్రంగా గాయపడగా మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్సై ఆదిలక్ష్మి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలపై ఐక్య పోరాటం



రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగిని సన్మానించిన రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు


నెల్లూరు(బారకాసు): జెండాలు, అజెండాలు పక్కనపెట్టి అందరం కలిసికట్టుగా రెడ్డి కులస్తుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలు చేద్దామని రెడ్డి సంక్షేమ సంఘం నెల్లూరు సిటీ నియోజకవర్గం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సంఘం ఆధ్వర్యంలో నెల్లూరులోని మినీ బైపాస్ రోడ్డులో ఉన్న పద్మావతి కమ్యూనిటీ హాల్లో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కులాల్లో ఉన్నట్లే రెడ్డి కులస్తుల్లో కూడా పేదలు ఉన్నారన్నారు. ఈ వర్గాన్ని ఓసీలుగా ప్రభుత్వం గుర్తించి అందులోని పేదవారికి న్యాయం చేయడం లేదన్నారు. కాబట్టి రెడ్డి కులస్తులందరూ ఏకమై నిరుపేదలకు సాయం చేసేందుకు, సమస్యలు పరిష్కారానికి ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే సంక్షేమ సంఘం నెల్లూరు సిటీ నియోజకవర్గం తరఫున ఇప్పటికే మూడు ఫ్రీజర్లను అందజేశామన్నారు. అంతేకాకుండా వివాహ సంబంధాలను కుదిర్చేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించనునట్లు ఆయన వెల్లడించారు. అనంతరం విశ్రాంత ఆర్టీసీ కండక్టర్ సానా శ్రీరాములురెడ్డిని శాలువాలు కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం సిటీ నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్లు ఈదల ధనూజ, బిరదవోలు వెంకురెడ్డి, సానా నర్సారెడ్డి, ట్రెజరర్ ఎంవీ రాజగోపాల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

బంగారు నగలకు మెరుగు పేరుతో మోసం

లింగసముద్రం: బంగారు నగలకు మెరుగు పెడతామని తీసుకుని సగం నగ మాత్రమే ఇచ్చి ఉడాయించిన ఘటన మండల కేంద్రమైన లింగసముద్రంలో ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. లింగసముద్రంలో సోమరిపాటి దొరసానమ్మ నివాసం ఉంటోంది. ఆమె ఇంటి వద్దకు బిహార్ వాసులు ఇద్దరు వచ్చి మీ బంగారు నగలకు మెరుగు పెడతామని నమ్మబలికారు. దీంతో ఆమె తన మెడలోని మూడు సవర్ల గొలుసు ఇచ్చింది. వారు మెరుగు పెట్టినట్లు నటించి గొలుసును సగానికి కత్తిరించి మిగిలింది ఇచ్చి వెళ్లిపోయారు. అరగంట తర్వాత గొలుసును చూసుకున్న దొరసానమ్మ చిన్నదిగా ఉండడంతో బంధువులకు చెప్పింది. అందరూ కలిసి నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నించగా ఒకరు పరారవగా మరొకరిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వారు వివరాలు సేకరిస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)	
పెద్దవి	రూ.100
సన్నవి	రూ.50
పండ్లు	రూ.35





నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు	
బ్రాయిలర్ (లైవ్)	123
లేయర్ (లైవ్)	115
బ్రాయిలర్ చికెన్	224
బ్రాయిలర్ స్కిన్‌లెస్	246
లేయర్ చికెన్	195

కురిసింది వాన..

నెల్లూరు(బారకాసు): జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం వర్షం కురిసింది. నెల్లూరు నగరంలో మధ్యాహ్నం ఒక్కసారిగా వాన పడింది. కొద్దిరోజులుగా మబ్బులు కమ్ముకుంటున్నా చినుకు జాడ లేదు. దీంతో ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. అయితే ఆదివారం వర్షం పడడం ఊరటనిచ్చింది. పలుచోట్ల రహదారుల్లోని గుంతల్లో నీరు నిల్వ చేరింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



వానలో వెళ్తున్న వాహనదారులు




రెయిన్‌కోట్ వేసుకుని వెళ్తూ..



వర్షంలో తడిచి ముద్దయిన నగరం



కేవీఆర్ పెట్రోల్ బంకు సమీపంలో కురుస్తున్న వర్షం



గొడుగు నీడలో వెళ్తూ..